# భర్త

అడిగెయ్యాలి.' జగన్నాథాన్ని సహాయం చెయ్యమని అడగాలి.

'ఏమిట్రా పలకరిస్తే ఏమిటా పరధ్యానం. సుశీలగారి గురించేనా నీ బాధ' నవ్వుతూ అడిగాడు జగన్నాథం.

'ఒరేయ్ జగన్!' ఆపైనమాటలు రాలేదు. గొంతు పూడుకుపోయినట్టైంది శేఖరానికి.

'బాధపడకురా!'చెప్పాడు జగన్. 'నువ్వు నన్ను ఎగతాళి చేస్తున్నప్పుడే నాకు తెలుసు. పెళ్ళయిన తరవాత నీకు ఈ బాధ తప్పదని. అందుకే నేను నీ మీద కోపగించుకొనేవాణ్ణి కాదు' అనునయించాడు జగన్నాథం.

'కానీ! నా ఆశయాలు ..ఆదర్శాలు ...,'

శేఖరం మాటలు ఇంకా పూర్తి చెయ్యక ముందే జగన్ అందుకున్నాడు.

'ఇంకా ఎక్కడి ఆశయాలురా! అవన్నీ తీసి అటకమీద పారెయ్. ఆడవాళ్ళ ఇతరమైన ఏ విషయంలోనైనా మొగుణ్ణి గౌరవిస్తారు కానీ ఈ సంగతి కొచ్చేసరికి మొగుడిమాట ఛస్తే వినరు' చెప్పాడు జగన్.

'నేనూ నా భార్యకు ఎంతో చెప్పి చూశాను. ఈ పాత బట్టలను ఎవరేనా బీద వాళ్ళకు ఉచితంగా ఇస్తే వాళ్ళుపొందే ఆనందం ముందు ఈ స్టీలుసామాన్లు ఒకలెక్కా? కావాలంటే ఈ స్టీలు సామాన్లు కొట్లో కొనుక్కోవటానికి డబ్బులు ఇస్తానన్నా కూడా నా శ్రీమతి వినలేదురా బ్రదర్. అందుకే సమయం వచ్చినప్పుడు ఆమె తెలుసుకోక పోతుందా అని ఆమెకు అనుగుణంగా నేనే మారాను.'

'ఆడవాళ్ళకు పాతబట్టలకు స్టీలుసామాన్లు కొనుక్కొని పొందే ఆనందంముందు. ప్రపంచంలో మరే ఇతరమైన ఆనందాలు సాటిరావు బ్రదర్! ఇది సృష్టిలోని రహస్యం మరియు సత్యం.' బోధించాడు జగన్నాథం.

జగన్నాథం మాటలు వింటూ శేఖరం నిజమే కాబోలుననుకున్నాడు తప్ప మాట్లాడలేక పోయాడు.

'అదిగో నీ భార్యబేరం ముగిసినట్లుంది. స్టీలు సామాన్లవాడు బయటకు వస్తున్నాడు. ఇప్పుడు మీ శ్రీమతి నిన్ను ఇక్కడ చూసిందంటే నీ మీద అనుమానపడగలదు. పద అలా వెళ్ళొద్దాం' బయలుదేర దీశాడు జగన్నాథం.

ఒకసారి ఇటువైపు చూసాడు శేఖర్.

స్టీలుసామాన్ల వాడి వెనకాలే భార్య క్రొత్తగా తీసుకున్న చిన్న స్టీలుగిన్నెను మురిపెంగా అటూ, ఇటూ త్రిప్పి చూసుకుంటూ బయటకు వచ్చింది.

సామాన్ల అబ్బాయి తట్టను కారేజి వెనకాల పెట్టి దానిని తాడుతో గట్టిగా కట్టేశాడు కాబోలు యధాప్రకారం సైకిల్ బెల్ మ్రోగించుకుంటూ ముందుకు దారితీశాడు.

శేఖర్ ఏదో జ్ఞానోదయమైన వాడిలాగా నిర్వికారంగా తలవంచుకొని స్కూటర్ స్టార్ట్ చేసాడు.



# మినీ కథలు

## ఉద్యోగం

రాత్రి రూంకు చేరేసరికి ఒంటిగంట దాటింది. అందుకే ఉదయం ఆలస్యంగా నిద్రలేచాను. ఇలా అర్ధరాత్రి దాటేవరకు బయట గడపడం నాకు మామూలే.

నేను చేసే ఉద్యోగం అలాంటిది. ఏరోజు ఎంతసేపు వుండవలసిన అవసరం వుంటుందో నాకే తెలియదు.

ఆ రోజు ఆదివారమనే విషయం గుర్తొచ్చింది. అందరికిలా నాకు ఆదివారం విశ్రాంతి రోజు కాదు. పైగా ఆరోజు నేను చాలా బిజీగా వుండేరోజు. టైం చూశాను. తొమ్మిదిన్నర కావస్తుంది. మరోగంటలో నేను బయట పడాలి.

నేను ప్రతిరోజు షేవ్ చేసుకుంటాను. మడతనలగని ఖరీదైన దుస్తులే ధరిస్తాను.ఎప్పుడూ నిగనిగలాడే షూ ధరిస్తాను. క్రాఫ్ చెదరకుండా అందంగా సెట్ చేసుకుంటాను. ఎడమచేతికి బ్లాక్ డయలున్న సీకోవాచీ, కుడిచేతి వేలికి వెంకటేశ్వరస్వామి ఉంగరం వుంటాయి. షర్ట్‌జేబులో ఒకవైపు గోల్డుకేప్ పెన్ మెరుస్తూ వుంటుంది.

నేను చాలా టిప్‌టాప్‌గా వుంటాను. ఒక మాటలో చెప్పాలంటే ఆఫీసర్ బాబులా వుంటాను. నా ఉద్యోగానికి అలావుండటం అవసరం.

డ్రస్ చేసుకుంటుండగా మా రూంఓనరు వచ్చాడు. అతనెందుకు వస్తాడో నాకు తెలుసు. పర్సులోంచి రెండు వందరూపాయల నోట్లుతీసి ఇచ్చాను. తీసుకొని వెళ్ళిపోయాడు.

నారూం అద్దె రెండువందలు. అడ్వాన్సుగా ఒక నెలఅద్దె అతనిదగ్గరే వుంది. ఈనెల అద్దె వారంక్రితమే ఇచ్చాను. ఇప్పుడు ఇచ్చినడబ్బు జరుగుతున్న నెలకు అడ్వాన్సుపేమెంటు. అయినా అతనికి డబ్బు అడిగినప్పుడల్లా ఇస్తూనేవుంటాను. అందుకు నేను బాధపడను.

నా రూం ఓనర్ డబ్బు అవసరమయితే తప్ప నా దగ్గరకురాడు. ఒకరివిషయంలోజోక్యం చేసుకోడు. చాలా జంటిల్‌మన్. నా మంచితనం మీద కొండంత నమ్మకమున్నవ్యక్తి. ఇక్కడ చేరిన తరువాత నా సంపాదనకూడా బాగా పెరిగింది. నాకు బాగా కలిసివచ్చినగది. దీన్నివదులుకోవటం నా కిష్టంలేదు.

టైం చూశాను. పదిన్నర కావస్తుంది.

నగరంలో ఆ రోజే రెండుసినిమాలు విడుదలయ్యాయి. ఆర్.టి.సి. సమ్మెవల్ల బస్సులు తిరగటం లేదు. రైల్వేస్టేషన్ చాలారద్దీగా వుంటుంది. స్టేషన్ చూసుకుని రెండు థియేటర్లు కవర్ చేయాలి.

కొత్తబ్లేడు జేబులో వేసుకుని రూంకుతాళం వేసి బయటపడ్డాను.

—ఆర్. లక్ష్మీనారాయణ
(గుంటూరు)

## క్వాలిఫికేషన్

"....అదిగో అక్కడ టెన్నిస్ ఆడ్తోంది మీ అమ్మాయేనా?"

"ఆఁ... ఏం?"

"గుడ్ పర్సనాలిటీ."

"థాంక్యూ... మీకో విషయం తెలుసా?"

"ఏమిటీ?"

"షి ఈజ్ జస్ట్ సిక్స్‌టీన్..."

"వయసుకి మించిన అందం..."

మెల్లగా నవ్వు. "నా పోలికే..."

క్షణం తర్వాత—

"మీ అమ్మాయిని 'సినిమాల్లో'చేర్పిస్తారా?"

"సినిమాల్లోనా?" ఆశ్చర్యం.

"అవును..."

"ఎందుకు?" ఏంమాట్లాడాలో తెలీలేదు.

"సినిమాల్లో ఎందుకేమిటి?... 'రాబడి' బాగా ఉంటుంది... 'సక్సెస్' అయ్యే అవకాశాలు కూడా చాలావున్నాయి..."

"సక్సెసా?" మరోసారి ఆశ్చర్యం.

"అవును."

"ఎలా?" ఆసక్తిగా చూసిందామె.

"ముందే అన్నాగా... మంచి పర్సనాలిటీ... ఇట్టే 'ఎట్రాక్ట్' అవుతారు జనం..."

"కానీ?"

"ఏమిటనుమానం?"

"మా అమ్మాయికి నటనంటే తెలీదు..."

"...డోంట్‌వరీ... 'నటన' పెద్దగా అవసరంలేదు సినిమాల్లో."

"ఇంకో సమస్య..."

"ఏమిటీ?"

"చిన్నప్పటినుండి పబ్లిక్ స్కూల్లో చదవడంవల్ల తెలుగు చదవడంకానీ, రాయడంకానీ, మాట్లాడం కూడా సరిగ్గారాదు..."

"ఫర్వాలేదు... డబ్బింగ్ చేయిస్తామ్!"

"...డ్యాన్స్ గట్రా తెలీదు..."

"...దానికేముంది... టెన్నిస్ ఆడ్తూ ఎగిరినట్టు ఎగిర్తే చాలు..."

"మరి?"

"ఇంకా ఏమిటి డౌట్?"

"...అదే... నటనలేదు... తెలుగురాదు... డ్యాన్స్ తెలీదు...ఎలా 'సక్సెస్' అవుతుందని..."

"...అదే... గుడ్ పర్సనాలిటీ ఉందిగా... అదే... 'అవయవ సౌష్టవం' బాగుందిగా..."

—ఆకెళ్ళ శివప్రసాద్
(హైదరాబాదు)